క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. చిత్తూరు నగరం, గుడిపాల, పూతలపట్టు, పాలసముద్రం, పెనుమూరు మండలాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

దోమల లార్వా నివారణకు గంబూసియా చేపలు


చెరువులో గంబూసియా చేపలను వదులుతున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: దోమలను లార్వా దశలోనే నివారించడానికి కుంటల్లో గంబూసియా చేపలను పెంచుతున్నట్లు వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండల కేంద్రంలోని కుంటలో శుక్రవారం గంబూసియా చేపల పిల్లలను వదిలిపెట్టారు. దోమల వ్యాప్తిని నివారించడానికే గంబూసియా చేపలను చెరువుల్లో పెంచుతున్నట్లు వివరించారు. దోమ కాటుకు గురికాకుండా వేపాకు పొగ వేయాలని సూచించారు. దోమ తెరలు వాడాలన్నారు. డాక్టర్‌తో పాటు హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంపకంపై అవగాహన


పశుగ్రాసంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పశుగ్రాసం సమపాళ్లలో అందించి, పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయకులు సురేష్ అన్నారు. చిత్తూరు మండలం తాళంబేడు గ్రామంలో శుక్రవారం పశుగ్రాస వారోత్సవాన్ని నిర్వహించారు. పశుగ్రాసం పెంపకంపై అవగాహన కల్పించారు. పశుగ్రాసంలో లోపాల వల్ల పాడి పరిశ్రమకు కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. రైతు పొలాల్లో పశుగ్రాసం పెంపకం చేపట్టి, వాటిని పాడి పశువులకు అందించడం మేలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీతా, వెల్ఫేర్ అసిస్టెంట్ కుసుమ, వ్యవసాయశాఖ సహాయకులు బిందు పాల్గొన్నారు.

ఖర్చుకు తగ్గ ఆదాయం రావాలి


రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు

చిత్తూరు కార్పొరేషన్: రైల్వేస్టేషన్‌లో అమృత్‌భారత్ పథకం కింద దాదాపు రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు తెలిపారు. చిత్తూరు రైల్వేస్టేషన్‌ను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ఇంత ఖర్చు పెడుతోంది.. అంతా ఆదాయం వచ్చే విధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదాయం లేకుండా వృథాగా ఖర్చు పెట్టడం ఎందుకన్నారు. ఇక్కడ 32 రైళ్లు వెళ్తుండగా 6 రైళ్లు ఆపడం లేదని అధికారులు తెలిపారు. స్టేషన్ సమీపంలో ఆర్‌ఓబీ నిర్మిస్తే ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. మామిడి, బెల్లం రవాణా రైళ్లలో చేస్తే బాగుంటుందన్నారు. స్టేషన్‌లో పనిచేస్తున్న హమాలీ, స్వీపర్లను శాశ్వత ప్రాతిపదికన తీసుకొని ఇంటి స్థలాలు ఇవ్వాలని కార్మికులు విన్నవించారు. చెన్నైకు నేరుగా రైలు లేదని ప్రయాణికులు తెలిపారు. జర్నలిస్టులకు రైల్వే పాసులను పునరుద్ధరించాలని మీడియా ప్రతినిధులు కోరారు. సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ వివరించారు.

సుందరీకరణకు చర్యలు


నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని చెరువులను సుందరీకరించడానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. నగరంలోని గంగినేని చెరువు, కట్టమంచి చెరువులను శుక్రవారం మేయర్ అముదతో కలిసి పరిశీలించారు. చెరువుల విస్తీర్ణం, సప్లయ్ చానళ్లు, ఆక్రమణల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువుల కింద ఉన్న కాలువలను శుభ్రంగా ఉంచుకోవాలని, స్థలాలు ఆక్రమణకు గురవకుండా కంచెలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ అరుణ, నీటిపారుదల శాఖ డీఈ హీరాలాల్ పాల్గొన్నారు.

చెరువులో పశుగ్రాసం మేస్తున్న ఆవులు


షెడ్డులో గ్రాసం తింటున్న పాడి ఆవులు


పశు పోషణపై అవగాహన

- రోగనిరోధక శక్తి పెరగాలంటే కొవ్వు పదార్థాలు తప్పనిసరి
- తగినంత నీరు అందించాలి
- పశు సంవర్ధక శాఖ అధికారులు

ఐరాల: వ్యవసాయంతో పాటు అనుబంధంగా పాడి పశువుల పోషణ మంచి ఆదాయం వనరు. అయితే పాడి పశువుల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఒక్కోసారి నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉంది. పశువులు వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. వాటికి సరైన పోషకాహారం అందజేయాలని ఐరాల పశు సంవర్ధక శాఖ ఏడీ పద్మావతి సూచిస్తున్నారు.

రోగనిరోధక శక్తికి మాంసకృత్తులు

పశువుల ఎదుగుదలకు, రోగనిరోధక శక్తికి మాంసకృత్తులు ఎంతో అవసరం. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు చిక్కిపోవడం, పెరుగుదల స్తంభించడం, అండాశయం చిన్నగా ఉండడం, ఆలస్యంగా యుక్త వయసుకు రావడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమమస్య ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి వంటివి, పప్పు జాతికి చెందిన పశుగ్రాసాల్లో మాంసకృత్తులు, విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి.

కొవ్వు పదార్థాలు తప్పనిసరి

పశువుల శరీరంలో కొవ్వు నిల్వలు అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి కాపాడతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. పశువుల సక్రమ పునరుత్పత్తిలో మాంసకృత్తుల కంటే కొవ్వు అందించే శక్తి ముఖ్యమైంది. కొవ్వు, పిండి పదార్థాల కన్నా రెండున్నరెట్లు అధిక శక్తినిస్తుంది. ఒక గ్రాము కొవ్వు పదార్థం సుమారు 9 కిలోల కేలరీల ఉష్ణశక్తిని అందిస్తుంది. వేరుశనగ పిండి, కొబ్బరి పిండి, నూనె గింజల చెక్క, వరి తవుడులో కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

నీరు లేకుంటే ఐదు రోజులే

పశువులు నీరు లేకుండా ఐదు రోజులకు మించి బతకలేవు. ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి పోషక పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థ పదార్థాల విసర్జనకు నీరు దోహదపడుతుంది. శరీరంలోని మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, పిండి పదార్థాల ఆక్సిడేషన్ వల్ల కూడా అర లీటరు నుంచి లీటరు వరకు నీరు ప్రతి పోషక పదార్థం నుంచి లభ్యమవుతుంది. శరీరంలో నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. పశువులు డీహైడ్రేషన్‌కు గురవుతాయి. పశువుకు రోజుకు 50 నుంచి 60 లీటర్ల వరకు నీరు అవసరం.

సమీకృత దాణా ఇవ్వాలి

సాధారణంగా చాలా మంది రైతులు పశువులకు దాణాగా తవుడును వేస్తుంటారు. సమీకృత దాణా తయారీకి ఖర్చు కొంచెం ఎక్కువ కావడమే దీనికి కారణం. అయితే మాంసకృత్తులు, పోషకాలు ఖనిజ లవణాలు తగు పాళ్లలో ఉండే సమీకృత దాణా అందిస్తే పశువులో పాల దిగుబడి సామర్థ్యం పెరుగుతుంది. రెండు లీటర్లకు పైబడి పాలిచ్చే పశువులకు తప్పనిసరిగా సమీకృత దాణాను ఇవ్వాలి. పాలిచ్చే గేదెలైతే ప్రతి రెండు లీటర్లకు కిలో చొప్పున రోజుకు ఏడు కిలోలకు మించకుండా దాణాను అందించాలి. పాలిచ్చే ఆవులకు ప్రతి 2.5 లీటర్లకు ఒక కిలో చొప్పున దాణా ఇవ్వాలి.

తాజాగా ఉండాలి

పశువులకు అందించే దాణా తాజాగా ఉండేలా చూసుకోవాలి. అంటే దానిని ఎప్పటికప్పుడు అవసరాన్ని బట్టి కలుపుకోవాలి. గాలి చొరబడని డబ్బాలు లేదా సంచుల్లో దాణాను నిల్వ చేసుకోవాలి. దాణా తయారీలో వినియోగించే గింజలను చెక్క ముక్కగా ఆడించాలి. వాటిని ముందుగానే ఆడించి నిల్వ చేసుకోవడం మంచిది కాదు. ఎందుకంటే గింజలపై ఉన్న పొరలు ఊడిపోయి చీడ పీడలు సులభంగా ఆశిస్తాయి.

దాణా సరైన పద్ధతిలో ఉండేలా చూసుకోవాలి

పాల ఉత్పత్తి సమయంలో చూడి దశలో, పెరుగుదల దశలో పశువులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలి. అంటే పశువు రోజువారీ ఆహార అవసరాలకు అనుగుణంగా ఎక్కువ మాంసకృత్తులను, అధిక శక్తిని అందించే ఆహారాన్ని ఇవ్వాలి. ఇందుకోసం అధిక పోషక విలువలు కలిగిన దినుసులను తగు పాళ్లలో కలిపి మర పట్టించాలి. ఆ మిశ్రమాన్నే దాణా అంటారు. ఈ దాణాలలో మాంసకృత్తులు 16 శాతం, జీర్ణమయ్యే పోషక పదార్థాలు 70 శాతం ఉండేలా వివిధ దినుసులు, పదార్థాలను కలుపుకోవాలి.

పోషణతోనే పాల ఉత్పత్తి



పశు పోషణ విషయంలో నేటికీ చాలా మంది రైతులు సంప్రదాయ పద్ధతులనే పాటిస్తున్నారు. పశువులకు పచ్చి, ఎండు గ్రాసంతో పాటుగా వేరుశనగ పిండి, నువ్వుల పిండితోపాటు పుష్టికరమైన మేతను అందించాలి. వరిగడ్డితో పాటు సమీకృత దాణాను ఇవ్వాలి. అప్పుడే పశువుల్లో ఉత్పాదక సామర్థ్యం పెరుగుతుంది. తద్వారా అధిక పాల దిగుబడి పొందవచ్చు. పాడి పోషణపై రైతులతో పాటు పశుపెంపకందారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పద్మావతి, ఏడీ, ఐరాల

ప్రగతి పథం.. కాణిపాకం

- మాస్టర్ ప్లాన్ పక్కాగా అమలు
- దేవస్థానం అభివృద్ధే లక్ష్యంగా అడుగులు
- భక్తుల వసతుల కల్పనే ధ్యేయం
- సాక్షితో ఈవో వెంకటేశు


కాణిపాక ఆలయం

వెంకటేశ్, ఈవో

కాణిపాకం: కాణిపాకం ప్రగతి పథంలో పయనిస్తోంది. ఆది దేవుడి సన్నిధిలో అభివృద్ధి తీగ అల్లుకుంటోంది. సకల వసతులు రూపుదిద్దుకుంటున్నాయి. ఆలయ అధికార యంత్రాంగం అమలు చేస్తున్న మాస్టర్ ప్లాన్ మార్పులు తీసుకొస్తోంది. అభివృద్ధికి దేవస్థానం తొలి ప్రాధాన్యత ఇస్తోంది. భక్తులకు సకల వసతులు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా కాణిపాకం కొత్తపుంతలు తొక్కుతోందని ఈవో వెంకటేశు సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రశ్న: అభివృద్ధి ఎలా సాగుతోంది?

జవాబు: గత మూడేళ్లుగా దేవస్థానంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. ప్రధానంగా ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేశాం. వెండి, బంగారు పూతతో ముఖద్వారానికి సరికొత్త శోభను తీసుకొచ్చాం. భక్తులకు సౌకర్యార్థంగా సదన్‌లో అదనపు గదుల నిర్మాణం చేపడుతున్నాం. పలు రోడ్ల నిర్మాణం చేపట్టాం. ఆ రోడ్లల్లో ఆర్చి నిర్మాణ పనులు పూర్తవుతోంది. లడ్డుపోటు భవన నిర్మాణం కూడా పూర్తయింది. సుమారు రూ.150 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టాం. ఇందుకు ఉన్నతాధికారులు, దాతలు, ఉభయదారులు, భక్తుల సహకారం ఉంది.

ప్రశ్న: దేవస్థానం మాస్టర్‌ప్లాన్ అమలు ఎంత వరకు వచ్చింది?

జవాబు: 2019లో మాస్టర్ ప్లాన్ తీసుకొచ్చారు. దాని ప్రకారం ఇప్పటి వరకు పలు పనులను పూర్తి చేశాం. మళ్లీ ఏడాదికి ముందు ఈ ప్లాన్‌పై సమీక్ష చేశాం. ఇందులో నూతనంగా క్యూ కాంప్లెక్స్ నిర్మించాలని, ఆర్టీసీ బస్టాండు, మహా ప్రాకారం నిర్మించాలని ప్లాన్‌లో ఉంది. నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం బహుదానదిపై రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని నివేదికల్లో ఉంది. జాతీయ రహదారి నుంచి నేరుగా ఆలయానికి చేరుకోవడానికి రోడ్డు నిర్మాణం చేపట్టే పనుల్లో ఉన్నాం.

ప్రశ్న: వసతుల కల్పనకు చర్యలేవి?

జవాబు: భక్తులకు వసతుల కల్పనలో భాగంగా వినాయక సదన్‌లో గదుల సంఖ్యను పెంచుతున్నాం. 100 గదులు ఉంటే వాటిని 200కు పెంచుతున్నాం. త్వరలో ఆ పనులు కూడా పూర్తి కావస్తోంది. ఇక కొత్తగా డార్మిటరీ నిర్మించనున్నాం. ముఖ్యంగా తిరుమలకు వచ్చే భక్తులు ఇక్కడ స్వామి వారిని దర్శించుకుని వెళ్లిపోతున్నారు. అలా కాకుండా భక్తులు కనువిందు చేసేలా, వారి మెచ్చేలా కాణిపాకాన్ని తీర్చిదిద్దాలనే ప్రయత్నంలో ఉన్నాం. ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేలా చూస్తాం. ఇవన్నీ కూడా మాస్టర్ ప్లాన్‌లో పొందుపరుస్తున్నాం.

ప్రశ్న: సాధించిన ప్రగతి ఏంటి?

జవాబు: దేవస్థానానికి కొత్త రూపం తీసుకోరావడంతో పాటు భక్తులకు ఇబ్బందులు లేకుండా వరసిద్ధుని దర్శించుకోవాలన్నదే లక్ష్యం. ఎన్నో ఏళ్లుగా సమస్యల్లో ఉన్న వంద అడుగుల రోడ్డును పూర్తి చేశాం. బంగారు రథాన్ని తయారు చేయించాం. లడ్డూపోటు, బంగారు, వెండి వాకిలి తయారు చేయించాం. భవిష్యత్‌లో డోకా లేకుండా.. మరో 50 ఏళ్ల దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నదే లక్ష్యంతో ముందుకెళుతున్నాం. అందుకు ఆది దేవుని కృప, కరుణ, కటాక్షం ఉంటే కచ్చితంగా నెరవేర్చేలా చూస్తాం.

ప్రశ్న: భక్తుల సమస్యలపై మీ స్పందన

జవాబు: భక్తుల ద్వారా వస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. స్వామి దర్శనంలో ఎలాంటి సమస్యలున్నా భక్తులు నేరుగా తమ దృష్టికి తీసుకునిరావచ్చు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా ఆలయ అభివృద్ధి, వసతుల కల్పనలో భక్తుల అభిప్రాయాలను సేకరిస్తున్నాం. అరుణాచలం, తిరుపతికి వెళ్లే భక్తులు ముందుగా ఆదిదేవుని దర్శించుకుంటే స్వామి కృప ఉంటుందని భక్తుల నమ్మకం. ఆలయ పవిత్రతకు భంగం కల్పించకుండా కాపాడుకుందాం.

సిరులు కురిపిస్తున్న విరులు


రైతు సాగు చేసిన బంతి పూలతోట


కొత్తరకం మ్యారీగోల్డ్ పూలతోట


సాగులో ఉన్న వెల్‌వెట్ పూలతోట

పాలసముద్రం మండలం చెరుముంద్ర కండ్రిగకు చెందిన రైతులు వినూత్నంగా ఆలోచించారు.. సంప్రదాయ పంటలను పక్కన పెట్టారు.. పూల సాగుపై దృష్టి పెట్టారు.. మార్కెట్‌లో డిమాండ్‌ను అందిపుచ్చుకున్నారు.. అవసరాలకు తగ్గట్టు విభిన్న రకాలను ఉత్పత్తి చేశారు. పువ్వుల సరఫరాలో పేరు పొందారు.. చివరకు ఆర్థికాభివృద్ధి సాధించారు.. అప్పుల ఊబి నుంచి బయటపడ్డారు. ఆదాయం మార్గంలో పయనిస్తున్నారు.

- పూల సాగులో చెరుముంద్ర కండ్రిగ రైతులు
- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న 200 కుటుంబాలు

పాలసముద్రం: చెరుముంద్రకండ్రిగ గ్రామంలో సుమారు 200 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయమే ఆధారంగా బతుకు బండి నడిపిస్తున్నారు. గతంలో ఇక్కడి రైతులు వరి, చెరకు పంటలు సాగు చేసి నష్టపోయి అప్పుల పాలయ్యారు. అయితే గత రెండేళ్లుగా పూల సాగు చేపట్టారు. తొలుత బంతి, నాటు చామంతి, మల్లెలు, కనకాంబరం సాగు చేసేవారు. ఇప్పుడు హైబ్రీడ్ వెల్‌వెట్, హైబ్రీడ్ చామంతి, పసుపు గులాబీ, తెల్ల గులాబీ వంటి రకాలను అధికంగా సాగు చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, తద్వారా ఆదాయం వస్తుండడంతో ఆర్థికంగా బలపడుతున్నారు. ఉదయం తోటలోని పూలను కూలీలతో కోయించుకుని తమిళనాడులోని తిర్తుతణి, వేలూరు, చెన్నై మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు. పూలకు మంచి గిరాకీ ఉన్నప్పుడు వ్యాపారులే తోట వద్దకు వచ్చి ముందస్తుగా అడ్వాన్సు సైతం ఇచ్చిపోతున్నారు. ఇక మండల పరిధిలో శుభకార్యాలయాలకు కూడా ఇక్కడి నుంచే పూలను తీసుకెళుతుంటారు.

డిమాండ్ ఉన్న రకాలనే..

మార్కెట్లో మంచి గిరాకీ ఉన్న పూల రకాలనే రైతులు ఎంపిక చేసుకుని సాగు చేస్తున్నారు. హైబ్రీడ్ చామంతి, వెల్‌వెట్ సాగు చేయాలంటే ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చు అవుతుంది. మ్యారీ గోల్డ్, మ్యారీ పింక్ సాగుకు ఎకరానికి రూ.90 వేల నుంచి లక్ష వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ఎకరాకు 10 నుంచి 12 వేలు మొక్కలు నాటాల్సి ఉంటుంది. నర్సరీల్లో 10 వేల మొక్కల ధర రూ.25 వేల నుంచి రూ.29 వేల వరకు ఉంది. ఎరువులు, దుక్కులు, కూలీలు, మందుల ఖర్చులు కలుపుకుంటే గరిష్టంగా రూ.50 వేలు నుంచి రూ.90 వేలు వరకు పెట్టుబడి అవుతుంది. మంచి దిగుబడి వస్తే ఎకరానికి 5 టన్నుల పూలు వస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో హైబ్రీడ్ చామంతి, గులాబీరంగు పూల ధరలు కిలో రూ.50 నుంచి రూ.70 వరకు పలుకుతోంది. ఈ మేరకు ఎకరాకు సుమారు రూ.2.5 లక్షల నుంచి రూ.3.5లక్షల వరకు వస్తుంది. మల్లి, కాగడ పూలు కిలో రూ.50 నుంచి రూ.60 వరకు ఉంది, కనకాంబరం కిలో రూ.150 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. త్వరలో ఆడి నెల, దీపావళి, కార్తీక మాసం రానుండడంతో పూల ధరలు మరింత పెరిగే అవకాశముంది.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

చెరుముంద్ర కండ్రిగ రైతులు సాగు చేసిన పూలను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. పండుగ సీజన్‌లో అక్కడి వ్యాపారులే ఇక్కడికి వస్తున్నారు. తోటల వద్దనే కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు. ధరలు ఆశాజనకంగా ఉండడంతో మరిన్ని కొత్తరకం పూలను సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

16న జాబ్‌మేళా

నగరి : నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎంఆర్‌ఎఫ్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ మంగళవారం ఎంఆర్‌ఎఫ్ ట్రైనీ ఉద్యోగాల కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ బి.సుబ్రమణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. పూర్తి వివరాలకు ఎంఆర్‌ఎఫ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ ఎస్ఎస్ కన్నన్‌ను 99529 70545కు జేకేసీ ఫుల్‌టైం మెంటార్ ఆర్.లాల్ బాషాను 95731 04593 నెంబరుకు సంప్రదించాలన్నారు.

ట్రిపుల్ ఐటీకి పూతలపట్టు విద్యార్థులు


అమృత వర్షిణి


దేవీప్రసాద్


లహరి


మేఘన

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎన్నికయ్యారని ఆ పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. 2024 పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేయగా, అందులో పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.మేఘన స్పోర్ట్స్ కోటాలో నూజివీడులోని ట్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు. అదే పాఠశాలకు చెందిన అమృతవర్షిణి, లహరి, దేవీప్రసాద్ ఉత్తీర్ణత పరంగా ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి ఎన్నికై నట్లు ఆయన పేర్కొన్నారు. ఉన్నత విద్యకోసం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు మనోహర్, మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు బృందం అభినందించారు.

సమస్యలు పరిష్కరించండి సారూ!


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

చిత్తూరు కలెక్టరేట్: సమస్యలు పరిష్కరించండి సారూ అంటూ ఎస్టీయూ, ఏపీటీఎఫ్ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘాల నాయకులు డీఈఓ దేవరాజును కలిసి టీచర్ల సమస్యల పరిష్కారంపై వినతిపత్రాలు అందజేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలకు సంబంధించి సెలవుల జాబితా రూపొందించాలని కోరారు. ఈ నెల 16న మొహర్రం పండుగ కావున ఆప్షనల్ సెలవు ప్రకటించాలన్నారు. రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలకు సంబంధించి ఉన్నత పాఠశాలలకు రావాల్సిన రూ.10,000 ఎస్‌జీసీ గ్రాంటు మంజూరు చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపీనాథ్ మాట్లాడుతూ పురపాలక పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్, భాషాపండితుల ఉద్యోగోన్నతులు నిర్వహించాలని కోరారు. ఎస్జీటీ, పండిట్‌ల ఉద్యోగోన్నతులు ఉమ్మడి సీనియారిటీ జాబితాతో నిర్వహించాలని న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ సంఘం సీనియర్ నాయకులు పురుషోత్తం, దేవరాజులురెడ్డి, గుణశేఖరన్, ఏపీటీఎఫ్ సంఘం ప్రధాన కార్యదర్శి ముక్తార్ అహ్మద్, నాయకులు జగదీష్, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం


వక్తృత్వ పోటీల్లో మాట్లాడుతున్న విద్యార్థి ధరణీధర్

తవణంపల్లె: పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని హైస్కూల్ హెచ్ఎం దేవరాజులు రెడ్డి విద్యార్థులకు సూచించారు. బాల్మర్ లార్విన్ సంస్థ సౌజన్యంతో శుక్రవారం హైస్కూల్లో పరిశుభ్రత వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణం, కాలుష్య నివారణ అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని వక్తలు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, బాల్మర్ లారిన్ సంస్థ ప్రతినిధులు సురేష్ ఆంటోని, రాఘవులు పాల్గొన్నారు.

ధర్మరాజస్వామి ఉత్సవాలకు శ్రీకారం

కార్వేటినగరం: మండల కేంద్రంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్చారణ నడమ ధ్వజారోహణం జరిపించారు. ధ్వజపటాన్ని ఎగురవేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో భాగవతారిణి రెడ్డెమ్మ ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం నిర్వహించారు. రాత్రి ప్రత్యేక వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కొలువుదీర్చి గ్రామోత్సవం చేశారు. ఇంటింటా భక్తులు కర్పూరహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలకు యాదవ కులస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యక్షుడు శివ ప్రకాష్, కోశాధికారి బాబురెడ్డి, ఉపకోశాధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.


ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు